VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ మంగళవారం 23 జూన్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 360
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

### దేవరకద్ర డిఆర్ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ

### రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు



న్యూఢిల్లీ, జూన్ 22 : ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ

మిగతా 2 లో

# ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

### రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం

### నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష



హైదరాబాద్, జూన్ 22 : తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమిక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా

-మిగతా 2 లో..

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ

### మెట్రో రెండోదశ విస్తరణ తదితర ప్రాజెక్టులపై చర్చ



న్యూఢిల్లీ, జూన్ 22 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్

మిగతా 2 లో

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

### జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు

### ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, జూన్ 22 : రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార/పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా

-మిగతా 2 లో..



## ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

### సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం

### ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం

### టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు.

హనుమకొండ, జూన్ 22 : నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం,

-మిగతా 2 లో..



## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

### కోచింగ్ సెంటర్‌లో మంటలు..15మంది దుర్మరణం

### తక్షణమే చర్యలకు దిగిన యూపి సిఎం యోగి

### ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యా ర్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపిం చడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపో యింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 15 మంది మృతి చెందినట్లు సమాచారం.

లక్నో, జూన్ 22 : భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి

-మిగతా 2 లో..



## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

### ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా

### వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కేటీఆర్ హెచ్చరిక

02

## భూమి గురించి అడిగితే పగబట్టారు

### రాయదుర్గం భూముల వేలంపై హరీష్ రావు ఫైర్



మహబూబ్‌నగర్, జూన్ 22 : హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిన్రు. ఇది కూడా ఉచితంగా

-మిగతా 2 లో..

## ఏకపక్షంగా రిజిస్ట్రేషన్ రద్దు చెల్లదు




, హైదరాబాద్: ఒక స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్(విక్రయ పత్రం)ను ఏకపక్షంగా రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి, వారి సమ్మతి తరువాత... లేదంటే ఏవైనా కోర్టు ఉత్తర్వులను జతచేశాకే రద్దు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. అంతేగాకుండా లేఔట్‌లలో ప్రజోపయోగార్థం కేటాయించిన స్థలాలకు క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పథకం వర్తించదని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట మండలం సర్వే నం.27/ఎ,ఎలోని 287 చదరపు గజాలకు చెందిన స్థలం క్రమబద్ధీకరణ దరఖాస్తును జీహెచ్ఎంసీ తిరస్కరించడాన్ని, ఆ స్థలానికి చెందిన రిజిస్ట్రేషన్(సేల్‌డీడ్)ను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కూకట్‌పల్లికి చెందిన కె.కమలమ్మ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ‘2014లో 287 చదరపు గజాలను పిటిషనర్ రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేశారు. అక్కడ రెండు తాత్కాలిక గదులను నిర్మించి విద్యుత్తు, ఆస్తి పన్ను తదితరాలు చెల్లిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారంటూ పొరుగువారిచ్చిన ఫిర్యాదు మేరకు వాటిని కూల్చివేశారు. వాస్తవానికి డ్రాఫ్ట్‌లేఔట్‌లో ఆ ప్రాంతంలో రోడ్డు ఉన్నప్పటికీ..డ్రాఫ్ట్ లేఔట్ తరువాత అది రద్దయింది. ఇవేమీ పరిశీలించకుండా ఏకపక్షంగా పిటిషనర్ పెట్టుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తును తిరస్కరించడంతోపాటు.. దాని ఆధారంగా రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేశారు’ అని కోర్టు దృష్టికి తెచ్చారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ డ్రాఫ్ట్ లేఔట్ ప్రకారం అక్కడ రోడ్డు ఉందని, దానికి సంబంధించిన గిఫ్ట్‌డీడ్ కూడా ఉందన్నారు. రోడ్డు కోసం కేటాయించిన స్థలాన్ని క్రమబద్ధీకరించడం కుదరదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి...

“లేఔట్ ప్రకారం రోడ్లను, బహిరంగ స్థలాలను గిఫ్ట్‌డీడ్ ద్వారా మున్సిపాలిటీకి అప్పగించాక, అవి రద్దు కానంతవరకు అందులో డెవలపర్‌కు హక్కులు ఉండవు. ప్రజోపయోగ అవసరాలకు కేటాయించిన స్థలాల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ ఉత్తర్వులు వర్తించవు” అని స్పష్టంచేశారు. రోడ్డు స్థలంలో ఉన్న ప్లాట్ తాలూకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తు తిరస్కరణ సబబేనంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

### ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి

### వరదల సమయంలో తక్షణ స్పందన కోసం సిద్ధం

### వరద ప్రాంతాల్లో అధికారులు పూర్తి అప్రమత్తత

### రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 22 : రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదు-పాయాలకు

-మిగతా 2 లో..

## ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్‌ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళు తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



## భూమి గురించి అడిగితే పగబట్టారు

(మొదటిపేజీ తరువాయి)

ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు. కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్బీఐ మీద పగపట్టిండు. ఎస్బీఐని నిషేధిస్తాం. ఎస్బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.



## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదివరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్/బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ–వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్,రెవెన్యూ, ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్–కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఇఇలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

(మొదటిపేజీ తరువాయి)

వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించను న్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసే లా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియా లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మెట్రో రైలు ఫేజ్–2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానత సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట్ ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట్ ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబా లకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబా లకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజే యనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం.




లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

### ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా

### వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కేటీఆర్ ఘాటు హెచ్చరిక

**వరంగల్, జూన్ 22 :** వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.



## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

(మొదటిపేజీ తరువాయి)

పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

(మొదటిపేజీ తరువాయి)


3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై ప్రత్యేక దృష్టి

- 2,601 రైతు వేదికల్లో జూన్ 23 నుండి 30 వరకు నిర్వహణ
- ఒకే వేదికపై రైతులకు నాణ్యమైన విత్తనాలు
- రైతులకు అందుబాటులో అన్నిరకాల విత్తనాలు
- అందుబాటులో నానో యూరియా, నానో డీఏపీ
- ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన

**హైదరాబాద్, జూన్ 22 :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను తట్టుకునే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో పప్పు జాతి పంటలను, నూనె గింజ పంటలను, చిరుధాన్యాలు. కూరగాయ పంటల సాగును రైతులను ప్రోత్సహించే దిశగా రైతులకు ఆయా పంటలకు సరైన విత్తనాలను, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచుటకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలలో ఈనెల 23వ తేదీ నుండి 30 తేదీ వరకు విత్తన మేళాలు నిర్వహించనుంది. ల్గ÷తులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల ధ్రువీకరించిన విత్తనాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందేలా వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విత్తన మేళాల్లో పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్య పంటల విత్తనాలతో పాటు నువ్వులు, వేరుశెనగ వంటి నూనె గింజల పంటల విత్తనాలు, వివిధ రకాల చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. అలాగే సమగ్ర పోషక యాజమాన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు అందుబాటులో ఉంచుతున్నారు. ల్గ÷తుల అభిరుచులు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని హెచ్ఎంటీ సోనా వంటి సన్న రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ÷త్తన మేళాల సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు రైతులకు విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర పంట యాజమాన్యం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపికపై కూడా రైతులకు మార్గదర్శకాలు అందించనున్నారు. విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ కోరారు.

# ప్రభుత్వ స్కూల్ కు... ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఔదార్యం.




రావుట్ల నర్సయ్య (సత్యశోధక్ పాఠశాల వ్యవస్థాపకులు) తన తమ్ముడు రావుట్ల చిన్న నర్సయ్య జ్ఞాపకార్థం సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1,50,000 విలువైన వంటశాలను నిర్మించడమైనది. (వీరిద్దరూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిరికొండ పూర్వ విద్యార్థులు)



- సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, "సత్యశోధక్" నర్సయ్య చేయూత.
- తన తమ్ముడి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు
- రూ.1.50 లక్షలతో ఆధునిక వంటశాల నిర్మాణం.
- చదివిన బడి రుణం తీర్చుకున్న: సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య.
- "సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తగా వెలిసిన కిచెన్ షెడ్ గోడలపై రావుట్ల నర్సయ్య, రావుట్ల చిన్న నర్సయ్య రెండు పేర్లు చెరగని అక్షరాలతో నిలిచాయి.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

2020లో అనారోగ్యంతో తమ్ముడు చిన్న నర్సయ్య అకాల మరణం చెందడంతో, ఆయన జ్ఞాపకాలను శాశ్వతంగా నిలుపుకోవాలని రావుట్ల నర్సయ్య సంకల్పించారు. ఆ సంకల్పమే ఇప్పుడు విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా, తమ్ముడి జ్ఞాపకార్థం రూ.1,50,000 వ్యయంతో ఆధునిక వంటశాల (కిచెన్ షెడ్) నిర్మించి పాఠశాలకు అందజేశారు.

**సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య, ఆయన తమ్ముడు రావుట్ల చిన్న నర్సయ్య ఈ ఇద్దరు సోదరులు ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. రావుట్ల నర్సయ్య 1985--86 నుండి 1991--92 వరకు, రావుట్ల చిన్న నర్సయ్య 1989--90 నుండి 1994--95 వరకు ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత కూడా తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను, బాల్య జ్ఞాపకాలను మరువలేదు.**

మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఈ వంటశాల ఎంతో ఉపయోగపడనుంది. వంట సామగ్రి, పాత్రలను భద్రపరిచేందుకు ప్రత్యేక స్థలం, వంట చేసేందుకు సౌకర్యవంతమైన గది, విద్యార్థులకు భోజనం వడ్డించేందుకు అనువైన ఏర్పాట్లతో ఈ వంటశాల నిర్మించారు.

**రావుట్ల నర్సయ్య మాటల్లో...**

"జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన గ్రామాన్ని, చదివిన పాఠశాలను మనిషి ఎన్నటికీ మరువకూడదు. మనం ఎంత చేసినా వాటి రుణం పూర్తిగా తీర్చలేం. నేడు నేను ఉన్న స్థితికి చేరుకోవడంలో ఈ పాఠశాల పాత్ర ఎంతో గొప్పది. తమ్ముడు లేని లోటును ఎప్పటికీ భర్తీ చేయలేను. కానీ ఆయన జ్ఞాపకం చిరస్థాయిగా నిలిచేలా, మన బడికి ఉపయోగపడే ఒక మంచి పని చేయాలనే ఆలోచనతో ఈ వంటశాలను నిర్మించాను. ఇది కేవలం ఒక నిర్మాణం కాదు... నేను చదివిన బడికి, నన్ను తీర్చిదిద్దిన గురువులకు అర్పించే చిన్న కృతజ్ఞత." "తమ్ముడి జ్ఞాపకాన్ని సేవగా మలిచి, చదివిన బడి రుణాన్ని కృతజ్ఞతగా తీర్చుకున్న రావుట్ల నర్సయ్య ఔదార్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం."

# కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం.


చింతల కిషన్ (ఇందల్వాయి)


అంబర్‌సింగ్ రాథోడ్ (డిచ్‌పల్లి)


మూత జనార్ధన్ (నిజామాబాద్ రూరల్)


గడ్డం సురేష్ (జక్రాన్‌పల్లి)


రొండ్ల గోవర్ధన్‌రెడ్డి (సిరికొండ)


మంగురపు రవి (మోపాల్)

**వేగుచుక్క న్యూస్:**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు కాంగ్రెస్ అధిష్టానం నూతన అధ్యక్షులను నియమించింది. ఈసందర్భం గా నూతనంగా నియామకమైన పార్టీ మండల అధ్యక్షులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినం దనలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ విజ యానికి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

**పదేళ్లలోఎ భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు**

**కేటీఆర్, హరీశ్‌రావుల తీరుపై ఎంపి ఆగ్రహం**

**సిఎం విజన్‌తో రాష్ట్రాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు**



**యాదాద్రి భువనగిరి, జూన్ 22 :** తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రో ఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రో ఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రో ఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రో ఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

## మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

**హైదరాబాద్,జూన్22(ఆర్ఎన్ఎ):** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు.



# ధనుష్-మృణాల్‌పై కొత్త ప్రచారం

హైదరాబాద్, జూన్ 21 :

కోలీవుడ్ నటుడు ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా మెలగడం వంటి అంశాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ ఇద్దరూ దూరమయ్యారంటూ సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. దీంతో ధనుష్, మృణాల్ సంబంధంపై మరోసారి ఆసక్తికరమైన ప్రచారం తెరపైకి వచ్చింది. గత ఏడాది ఆగస్టులో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్ ప్రదర్శనలో ధనుష్, మృణాల్ కలిసి కనిపించడం అభిమానుల్లో చర్చకు దారి తీసింది. ఆ తరువాత ధనుష్ నటించిన 'తేరే ఇష్క్ మే' చిత్రానికి సంబంధించిన వేడుకలో కూడా మృణాల్ పాల్గొనడం వీరిద్దరి మధ్య ప్రత్యేక అనుబంధం ఉందనే ప్రచారానికి కారణమైంది. అంతేకాకుండా మృణాల్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ధనుష్ సోదరీమణులు కార్తీక, విమలా గీతలను అనుసరిస్తుండటమూ ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనీ, త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనీ కథనాలు వినిపించాయి. ఈ ప్రచారంపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ వ్యాఖ్యలతోనూ పుకార్లకు పూర్తిగా తెరపడలేదు. ఇదిలా ఉండగా, వీరిద్దరికీ సన్నిహితంగా ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం ధనుష్, మృణాల్ నిజంగానే ఒకరినొకరు ఇష్టపడుతున్నారని, అయితే ఆ సంబంధం ప్రారంభ దశలోనే ఉందని చెప్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇద్దరికీ ఒకే విధమైన ఆలోచనలు, విలువలు ఉండటంతో బాగా కలిసిపోయారని, కానీ వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచాలని భావిస్తున్నారని కూడా ప్రచారం జరిగింది. ఇప్పుడు తాజాగా కొన్ని సినీ వర్గాల కథనాల ప్రకారం ధనుష్, మృణాల్ మధ్య దూరం పెరిగిందని, ఇద్దరూ విడిపోయారనే వార్తలు వినిపి స్తున్నా యి. అయితే వీరి మధ్య విభేదాలకు గల అసలు కారణా లేమిటన్నది ఇప్పటివరకు బయటకు రాలేదు. మరోవైపు ఈ ప్రచారంపై ఇప్పటి వరకు అటు ధనుష్ గానీ, ఇటు మృణాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ధనుష్ గతంలో సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు.




# 'బాహుబలి' డాక్యుసిరీస్‌కు విడుదల తేదీ

హైదరాబాద్, జూన్ 21 :

ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన 'బాహుబలి' ఫ్రాంచైజీకి సంబంధించి మరో ఆసక్తికర అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. 'బాహుబలి: ది టార్చ్ బేరర్' పేరుతో రూపొందిన డాక్యుసిరీస్ ఈ నెల 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'బాహుబలి' రెండు భాగాల విజయంతో తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నేపథ్యంలో, ఇప్పుడు ఆ మహా ప్రయాణం వెనుక కథలను ఈ డాక్యుసిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇది సాధారణ సినిమా కాకుండా, 'బాహుబలి' రూపుదిద్దుకున్న తీరు, ఆ ఫ్రాంచైజీ వెనుక ఉన్న కఠిన శ్రమ, సృజనాత్మక దృష్టి, సాంకేతిక విస్తృతి, ప్రపంచవ్యాప్తంగా దక్కిన స్పందన వంటి అంశాలను ప్రతిబింబించే డాక్యుసిరీస్‌గా రూపొందినట్లు సమాచారం. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆలోచన ఎలా ఆవిర్భవించింది, ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ వంటి తారలు తమ పాత్రల కోసం ఎలా సిద్ధమయ్యారు, వేలాది మంది సాంకేతిక నిపుణులు ఈ మహా ప్రాజెక్ట్ కోసం ఎంతటి కృషి చేశారు వంటి విశేషాలను ఇందులో చూపించనున్నారు.





# జ్యోతికకు 27 ఏళ్లలో హిందీ ఆఫర్ లేదు

హైదరాబాద్, జూన్ 21 :

దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి జ్యోతిక తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా తమిళ, తెలుగు చిత్రసీమల్లో విజయవంతమైన నటిగా కొనసాగిన ఆమెకు 27 ఏళ్ల సినీ ప్రయాణంలో ఒక్క హిందీ సినిమా అవకాశం కూడా రాలేదని వెల్లడించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకప్పుడు బాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమైనప్పటికీ, ఆ తర్వాత అక్కడి నుంచి ఎలాంటి అవకాశాలు రాకపోవడం గురించి జ్యోతిక చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విస్తృతంగా చర్చకు దారి తీశాయి. 1998లో విడుదలైన 'దోలి సజా కె రఖ్నా' చిత్రంతో జ్యోతిక హిందీ చిత్రసీమలో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోవడంతో ఆమె దక్షిణాది చిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేశారు. అనంతరం తమిళ సినీ పరిశ్రమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన జ్యోతిక, తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితమైన నటిగా మారారు. అనేక సూపర్‌హిట్, బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగ పాత్రలు, వాణిజ్య చిత్రాలు ఇలా విభిన్నమైన కథాంశాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఇలాంటి విజయవంతమైన కెరీర్ ఉన్నప్పటికీ బాలీవుడ్ నుంచి అవకాశాలు రాకపో వడంపై జ్యోతిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



# నందిని రెడ్డి మాటలు మళ్లీ వైరల్

హైదరాబాద్, జూన్ 21 :

తెలుగు సినీ పరిశ్రమలో కుటుంబ కథా చిత్రాలను హృద్యంగా ఆవిష్కరించే దర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నందిని రెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. 'అలా మొదలైంది'తో దర్శకురాలిగా విజయవంతమైన ఆరంభం చేసిన ఆమె, ఆ తర్వాత 'కల్యాణ వైభోగమే', 'ఓ బేబీ' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తాజాగా సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చిన నందిని, ప్రస్తుతం మంచి చర్చలో నిలిచారు. ఇదే సమయంలో ఆమె గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వ్యక్తిగత జీవితం, అభిరుచులు, పెళ్లి గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నందిని రెడ్డి సినీ ప్రయాణం మొదటి చిత్రంతోనే ప్రత్యేకంగా నిలిచింది. 'అలా మొదలైంది' ద్వారా సహజమైన ప్రేమకథను, భావోద్వేగాలను తెరపై ఆహ్లాదకరంగా ఆవిష్కరించిన ఆమె, తొలి ప్రయత్నంతోనే దర్శకురాలిగా మంచి గుర్తింపు పొందారు. అనంతరం 'జబర్దస్త్', 'కల్యాణ వైభోగమే', 'ఓ బేబీ' వంటి చిత్రాలతో కుటుంబ కథలు, హాస్యం, భావోద్వేగాలను మేళవించే దర్శకురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' చిత్రంతో మరోసారి తన కథనం, భావోద్వేగాల మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జూన్ 19న విడుదలైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఈ చిత్రం గూఢచారి కథ కాదు, కుటుంబ భావోద్వేగాలతో కూడిన కథ అని నందిని రెడ్డి ప్రమోషన్ సమయంలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గతంలో ఒక ఇంటర్వ్యూలో నందిని రెడ్డి తన వ్యక్తిగత అభిరుచుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. చిన్నప్పటి నుంచి తనకు ఉంగరాల జుట్టు ఉండేదని, జడ వేయించుకునే సమయంలో చాలా నొప్పిగా అనిపించేదని, అందుకే అవకాశం దొరికినప్పుడల్లా జుట్టు కత్తి రించించుకునేదాన్నని ఆమె చెప్పారు. ఆ అలవాటు ఇప్పటికీ అలాగే కొనసాగుతోందని పేర్కొన్నారు.



# 'బిగ్‌బాస్ తెలుగు 10'పై భారీ ఆసక్తి

హైదరాబాద్, జూన్ 21 :

తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ కొనసాగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సీజన్ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పించే విధంగా 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదో సీజన్ కావడంతో హౌస్‌లో కొత్త కాన్సెప్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు, విభిన్నమైన టాస్కులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టెలివిజన్ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లు కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో చర్చకు దారి తీస్తున్నాయి. ఇక తాజాగా ఈ జాబితాలో జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర పేరు కూడా బలంగా వినిపిస్తోంది. 'జబర్దస్త్', 'శ్రీదేవి డ్రామా కంపెనీ' వంటి కామెడీ షోల ద్వారా గుర్తింపు పొందిన పవిత్ర, తన సహజమైన హాస్యం, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన ఆమె, తన ప్రతిభతో బుల్లితెరపై ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గతంలోనూ ఆమె పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా వినిపించినప్పటికీ, ఈసారి మాత్రం హౌస్‌లోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కు ంవగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బిగ్‌బాస్ టీమ్ ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పవిత్ర నిజంగానే హౌస్‌లోకి అడుగుపెడితే షోకు వినోదం మరింత పెరుగుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో 'బిగ్‌బాస్ తెలుగు 10'పై ఉత్కంఠ రోజురోజుకీ పెరుగుతోంది.